క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



బాధితుడికి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన జీవన్ అనారోగ్యంతో బాధ పడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డిని స్పందించారు. ఆయన మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల సహకారంతో సీఎం సహాయనిధి నుంచి ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఆదివారం జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి రూ.50వేల ఎల్‌ఓసీని లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ రాజు ఉన్నారు.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సంగారెడ్డి జోన్: ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థులకు అందించే డైట్, కాస్మోటిక్ చార్జిల పెంపుతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంతో పాటు ప్రభుత్వ ఆనంద నిలయాల్లో విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ చిత్ర పటాలను ప్రదర్శిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సహాయం సాంఘిక సంక్షేమ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవా కేంద్రం ప్రారంభం



ఎస్‌బీఐ సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎంఈఓ అంజయ్య

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఖాతాదారుల సేవా కేంద్రాన్ని ఆదివారం మండల విద్యాధికారి అంజయ్య స్థానిక నాయకులు తుకారాంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఎస్‌బీఐ గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించడం శుభ సూచికమన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో గోపాల్, మాజీ సర్పంచ్ నాగార్జున, స్థానికులు రవి, రాజు, నర్సింలు, శీను, ఖదీర్ పాల్గొన్నారు.

నిఘా వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న భెల్ ఈడీ రాజా తదితరులు

రామచంద్రాపురం (పటాన్‌చెరు): రామచంద్రాపురం బీహెచ్‌ఈఎల్ యూనిట్‌లో ఆదివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 3కే రన్‌ను భెల్ ఈడీ కె.బి.రాజా, పీఈఅండ్ ఎస్‌డీ ఈడీ వై.శ్రీనివాస్ రావు ప్రారంభించారు. కార్మికులు, ఉద్యోగులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిఘాపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించామన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం



ఉమ్రా యాత్రికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

జహీరాబాద్ టౌన్: ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారిని ఎమ్మెల్యే మాణిక్‌రావు క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. జహీరాబాద్ పట్టణానికి చెందిన అయుబ్, జాఫర్‌లు ఉమ్రా యాత్రకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువా కప్పి సన్మానించారు. ఉమ్రా యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకొని రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు యాకూబ్, అలీ, జుబూర్, పెద్ద గొల్లనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అందోల్‌లో నర్సింగ్ కోర్సు

- త్వరలో ప్రారంభించనున్న మంత్రి
- అదే రోజున కొత్త భవనానికి శంకుస్థాపన
- పీజీ కళాశాల నూతన భవనంలో ఏర్పాట్లు



నర్సింగ్ కళాశాల కోసం సిద్ధమవుతున్న భవనం

జోగిపేట(అందోల్): అందోల్ నియోజకవర్గ కేంద్రంలో మరో ఉన్నత విద్యకు సంబంధించిన కోర్సు ప్రారంభం కాబోతుంది. ఇప్పటివరకు జేఎన్‌టీయూ, పీజీ, పాలిటెక్నిక్ జనరల్, బాలికల కళాశాలలు ఉన్నాయి. దామోదర రాజనర్సింహ వైద్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 150 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాలను ఏర్పాటుకు సిద్ధమయ్యారు. వెంటనే సంబంధిత ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి సాధించారు. ఈ సంవత్సరం నుంచే 60 మంది విద్యార్థినులతో నర్సింగ్ కోర్సును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయిస్తున్నారు. కొత్త నర్సింగ్ కళాశాల భవనాన్ని నిర్మించేందుకు రూ.43 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

15 రోజుల్లో కళాశాల ప్రారంభం

నర్సింగ్ కళాశాల తరగతులను పీజీ కళాశాల కోసం నిర్మిస్తున్న నూతన భవనంలో త్వరలో మంత్రి దామోదర రాజనర్సింహ్మ ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించి సీసీ రోడ్డు, భవనంలో ఫ్లోరింగ్, డోర్లు తదితర పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. కళాశాల తాత్కాలిక భవనం పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇటీవల మంత్రి దామోదర స్వయంగా పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. అదే రోజున కొత్త నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

ప్రతి శాఖలోనూ దామోదర మార్క్

అందోల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నాలుగు సార్లు ఎన్నికైన దామోదర్ రాజనర్సింహ ఇప్పటి వరకు ఆయన నిర్వహించిన మంత్రిత్వ శాఖల్లో తన మార్క్ ఉండేలా చూడడం ఆనవాయితీ. మార్కెటింగ్‌శాఖ మంత్రిగా వట్‌పల్లిలో మోడల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, విద్యాశాఖ మంత్రిగా జోగిపేటలో రూ.2 కోట్లతో పాఠశాల భవనం, అక్సాన్‌పల్లిలో మోడల్ స్కూల్, ఉన్నత, సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా సుల్తాన్‌పూర్‌లో రూ.350 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాల, జనరల్ పాలిటెక్నిక్, మహిళా పాలిటెక్నిక్ కళాశాలలు, పీజీ కళాశాలను మంజూరు చేయించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

నర్సింగ్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణ ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి దామోదర రాజనర్సింహ వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థినులకు అవసరమైన వసతులు కల్పించాలని మంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వైద్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా జడ్ చోగ్తూ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఎండి హేమంత్ సహదేవ్‌రావుతో కలిసి మంత్రి శనివారం సమీక్షించారు.



నర్సింగ్ కళాశాల వద్ద వేసిన సీసీ రోడ్డు

ఉత్సవాలను విజయవంతం చేయండి

- జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్



భక్తులకు కరపత్రాలను అందజేస్తున్న జ్ఞానేశ్వర్

మునిపల్లి(అందోల్): జీవన్ముక్త సంస్థానంలో జరిగే పాండురంగ వితలేశ్వర, రుక్మాబాయి, జీవన్ముక్త మహారాజ్ ఉత్సవాలకు గ్రామంలోని ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ గ్రామస్తులను కోరారు. ఆదివారం మండలంలోని అంతారం గ్రామ ప్రజలకు, భక్తులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 25 నుంచి 29 వరకు జరిగే ఉత్సవాల్లో గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఇద్దరు చొప్పున హాజరు కావాలన్నారు. 24న ఎల్లారెడ్డి, కామారెడ్డి నుంచి పాదయాత్ర, భిక్షాటనకు వెళ్లి తిరిగి వస్తానన్నారు. అప్పటి వరకు గ్రామంలోని భక్తులు ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చూడాలన్నారు. కరపత్రాల పంపిణీ త్వరితగతి పూర్తి చేయాలన్నారు. భక్తులకు ప్రతి రోజు అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే గురువులు ఉండడానికి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లన్న పటేల్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

43 రోజుల తర్వాత తాగు నీటి సరఫరా

- విధుల్లో చేరిన మిషన్ భగీరథ కార్మికులు

నాల్‌కల్(జహీరాబాద్): 43 రోజుల తర్వాత ఎట్టకేలకు మిషన్ భగీరథ నీటి సరఫరా ఆదివారం ప్రారంభమైంది. 9 నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఫలితంగా న్యాల్‌కల్ మండలంతో పాటు ఝరాసంగం మండలంలోని పలు గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ పథకంలో భాగంగా తాత్కాలిక పద్ధతిన పని చేస్తున్న 24 మంది కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదు. దీంతో వారు సమ్మె బాట పట్టారు. ఫలితంగా 43 రోజులుగా ఆయా గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగీరథ జిల్లా ఎస్ఈ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, డీఈఈ కుమారస్వామి మిషన్ భగీరథ కార్మికులను మూడు రోజుల క్రితం హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. జీతాలు త్వరలో చెల్లిస్తామని, నీటి సరఫరాను పునరుద్ధరించాలని కార్మికులను కోరారు. నెలల తరబడి జీతాలు చెల్లించడం లేదని, జీతాలు చెల్లిస్తేనే నీటిని విడుదల చేస్తామని కార్మికులు తేల్చి చెప్పారు. మీరు నీటిని సరఫరా చేయకపోతే మేమే సరఫరా చేస్తామని అధికారులు స్టేషన్ నుంచి ఫిల్టర్ బెడ్‌కు వెళ్లారు. మీరు నీటిని ఎలా విడుస్తారో చూస్తామని కార్మికులు కూడా అక్కడకు వెళ్లి వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు కార్మికులతో చర్చించి ఒక నెల జీతం వెంటనే చెల్లిస్తామని, 6 నెలల జీతాలు నవంబర్ 15వ తేదీలోపు చెల్లిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించి, నీటిని సరఫరా చేశారు.



కార్మికులతో చర్చలు జరుపుతున్న అధికారులు

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. ప్రభుత్వం విద్యార్థులకు కాస్మోటిక్, న్యూట్రిషన్‌పై 40 శాతం చార్జీలు పెంపు నేపథ్యంలో విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో విద్యార్థులకు కాస్మోటిక్,న్యూట్రిషన్ చార్జీలు పెంచకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, డీసీసీ కార్యదర్శి సమయ్య, నాయకులు యువరాజ్, నర్సింహ, సతీష్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక సదర్



సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న నీలం మధు

- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: యాదవుల సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక సదర్ ఉత్సవాలని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజుయాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సదర్ ఉత్సవాలకు మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలు యాదవుల ఐక్యత, జంతువులపై వారికున్న ప్రేమ, జీవన విధానాన్ని చాటుతాయని తెలిపారు. పాడి పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతు న్న యాదవ సోదరులు పశువుల సంతతి పెరగడానికి దున్నపోతులను పవిత్రంగా చూడడం ఈ సదర్ సమ్మేళన ప్రత్యేకత అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక పండగగా ప్రకటించారని గుర్తు చేశారు. సదర్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పులిరాజు నృత్యాలు, దున్నపోతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్పయాదవ్, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, దేవరాజ్, కృష్ణ యాదవ్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా కాపు వనభోజనం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉమారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శ్రీకృష్ణదేవరాయ కాపు సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం భెల్ కాలనీలో 58వ కార్తీకమాస వనభోజన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే ఉదయభాను ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ కళాకారులు రోజా రమణి, చక్రపాణి, తరుణ్, పారిశ్రామికవేత్త అరవ రామకృష్ణ పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదివారం హైదరాబాద్ చార్మినార్ వద్ద గల భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఖేడ్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వీరశైవ ధర్మం రాబోయే తరాలకు అందాలి



సాహిత్య సదస్సులో మాట్లాడుతున్న స్వామిజీ

సదాశివపేట(సంగారెడ్డి): అత్యంత ప్రాచీనమైన వీరశైవ ధర్మం రాబోయే తరాలకు అందజేయాలనే సంకల్పమే వీరశైవ సాహిత్య సదస్సు ప్రధాన లక్ష్యమని షట్‌స్థల బ్రహ్మశ్రీ శివయోగి శివచార్య, వీరేశ్వర శివచార్య, సిద్దేశ్వరానందగిరి మహారాజ్, హిరేమట్ మల్లికార్జున స్వాములు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎడ్ల బజార్ వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో వీరశైవ సాహిత్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరశైవ సాహిత్య సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. సాహిత్య సదస్సులో పత్ర సమర్పణ ప్రవచన కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై పలువురు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ ధర్మ ప్రచార అధ్యక్షుడు జగదేవ్ హీరామట్, ఎడ్లబజార్ వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు గందిగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జయప్రకాశ్, మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల అద్దె చార్జీల తగ్గింపు



డిపో మేనేజర్ జాకీర్‌హుసేన్

జహీరాబాద్: ఆర్టీసీ అద్దె బస్సులు తీసుకునే వారికి సంస్థ శుభవార్త చెప్పిందని జహీరాబాద్ బస్ డిపో మేనేజర్ జాకీర్‌హుసేన్ అన్నారు. పెళ్లిళ్లు, శుభ కార్యాలు, విహార యాత్రలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకునే వారికి అద్దె చార్జీలను భారీగా తగ్గించినట్లు పేర్కొన్నారు. గత ధరలతో పోల్చితే ప్రస్తుతం కిలోమీటర్‌కు పల్లెవెలుగు బస్సుపై రూ.11, ఎక్స్‌ప్రెస్ సర్వీసులపై రూ.7, డీలక్స్ బస్సులపై రూ.8, సూపర్ లగ్జరీ బస్సులపై రూ.6 మేర చార్జీలను తగ్గించినట్లు తెలిపారు. అంతే కాకుండా అయ్యప్పస్వాముల శబరిమల యాత్రకు అద్దె బస్సులు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రయాణ అవసరాలు, శుభ కార్యాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకుని క్షేమంగా గమ్యస్థానాలకు చేరాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు 10 శాతం ప్రత్యేక రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వివరాలకు 9959226269, 9494093486 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



హత్నూర: కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జ్యోతి



వట్‌పల్లి(అందోల్): కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ జంగారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ జ్యోతి అన్నారు. ఆదివారం హత్నూరలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి రైస్ మిల్లులకు పంపించాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రికార్డులు రాసి డబ్బులు రైతులకు అందేలా చూడాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రైతులు కూడా ధాన్యాన్ని మంచిగా ఆరబెట్టాలని సూచించారు. డీపీఎం జయశ్రీ మండలంలోని దౌల్తాబాద్, మంగాపూర్, దౌలాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఏపీఎం దేవేందర్, సీసీలు నాగరాణి, మహేశ్, వీఓఏలు కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

సంగారెడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చౌటుకూరు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దశరథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చక్రియాల గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

ఇబ్బందులు లేకుండా చూడాలి

సంగారెడ్డి టౌన్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. ఆదివారం సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మాణిక్యం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మండల శాఖ అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి

జిన్నారం (పటాన్‌చెరు): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిన్నారం తహసీల్దార్ భిక్షపతి అన్నారు. ఈ మేరకు ఆదివారం జిన్నారం, వావిలాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం విక్రయించిన వారంలోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నరేందర్, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

ఐకేపీ కేంద్రాల తనిఖీ

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అడిషనల్ డీఆర్‌డీఓ జంగారెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల్లో రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కేంద్రాల్లో తూకం వేస్తున్నారా లేదా తెలుసుకున్నారు. తేమ శాతం పేరుతో తూకం వేయడంలో నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. మండలం పరిధిలోని అన్నాసాగర్‌లోని కేంద్రంలో రైతులతో ఆయన స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్రంలో కొనుగోలు చేస్తున్న తేమ శాతాన్ని పరిశీలించారు. కేంద్రంలో అన్ని పరికరాలు ఉన్నాయాని తెలుసుకున్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏపీఎం మాణిక్యం, సీసీ మమత, వీఓఏ లక్ష్మి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హత్నూర: పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని కుప్పానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం 2013–14సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు కుప్పానగర్ పాఠశాల ఆవరణలో కలిశారు. విద్యార్థి దశ మధుర జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు.

ఘనంగా సమ్మేళనం

హత్నూర (సంగారెడ్డి): హత్నూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000- 2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని సంతోషపడ్డారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.



ఝరాసంగంలో..

టీయూడబ్ల్యూజే అధ్యక్షుడికి సన్మానం



యాదగిరిని సత్కరిస్తున్న సంఘం నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డి జిల్లా (టీయూడబ్ల్యూజే– ఐజేయూ) తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు బండారు యాదగిరిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, రాష్ట్ర మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే– ఐజేయూ అధ్యక్షుడు బండారు యాదగిరిని శాలువా కప్పి సత్కరించి, మెమోంటో అందజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయడమే కాకుండా వైశ్య సంఘం బలోపేతానికి చేస్తున్న కృషికి యాదగిరిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చందా శ్రీధర్, పుల్లూరు ప్రకాష్ , ఇరుకుల ప్రదీప్, కుందారం రాజయ్య, ఆమేటి మహేందర్, పుట్నాల లక్ష్మణ్, తహసీల్దార్ సతీష్, మాచర్ల సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా రాచిరెడ్డి



సదాశివపేట(సంగారెడ్డి): ఉద్యమకారులందరికీ ప్రభుత్వపరంగా న్యాయం జరిగేలా శ్రమిస్తామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాచిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ చైర్మన్ శ్రీనివాస్ సంగారెడ్డి జిల్లా ఫోరం అధ్యక్షుడిగా సదాశివపేటకు చెందిన రాచిరెడ్డిని ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా రాచిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో ఎలా శ్రమించామో అదే తరహా జిల్లా ఉద్యమకారుల సంక్షేమానికి పోరాటం చేస్తానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.